# కలెక్టర్ ఆరా.!

## ఆకస్మిక తనిఖీలతో జిల్లా అధికారుల్లో హడల్



ఆరా పదానికి చాలా అర్థాలే ఉన్నాయి. తెలుగులో ఆరా అంటే కూపీ లాగడం... ఇంగ్లీషులో ఆరా అంటే ఆయన చుట్టు ప్రత్యేకమైన వాతావరణం ఉండటం.. హిందీలో ఆరా అంటే వస్తున్నాడని అర్థం. ఇవన్నీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వర్తిస్తాయనే చెప్పాలి. క్షేత్రస్థాయి పర్యటనలు.. ఆకస్మిక తనిఖీలు.. సమస్యల గుర్తింపు.. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు... వసతుల కల్పనకు నిధుల మంజూరు వంటి పక్కా ప్రణాళికతో బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే తన మార్క్ పనితీరును చూపిస్తున్నారు. ఇప్పుడిది అధికార, ఉద్యోగుల్లో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**సాక్షి,మేడ్చల్‌జిల్లా:** ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ మనుచౌదరి ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తున్నారు. తనఖీలకు ఆ ప్రాంతానికి వెళ్లిన తర్వాతనే సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సమాచారం అందుతోంది. దీంతో వారంతా అప్రమత్తంగా ఉంటూ ఉద్యోగులు, సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన ప్రణాళికతో నిధులు మంజూరు చేస్తూ పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

**సమస్యలు తెలుసుకున్న వెంటనే నిధులు మంజూరు చేస్తూ..**

ఇప్పటి వరకు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, పాలిటెక్నిక్ భవనం కోసం రూ.2 కోట్లు, కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులను ఆయన మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారునలు ఆదేశించారు. భవనాలకు అవసరమైన చోట ప్రభుత్వ స్థలాల కేటాయింపులో కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రభుత్వ, పీహెచ్‌సీలకు నేరుగా వెళ్లి...**

ఘట్‌కేసర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కీసర పీహెచ్‌సీ, కూకట్‌పల్లి, తూముకుంట, షాపూర్, మూసాపేట యూపీహెచ్‌సీలు, మల్కాజిగిరి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా.. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ఓపీ ఎలా నడుస్తోంది.? గర్భిణుల సంఖ్య ఎంత ఉంటుంది..? వారందరూ పరీక్షల కోసం వస్తున్నారా..? రానట్లయితే వైద్య పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు.? వారిని పీహెచ్‌సీలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారా..? అని ఆరా తీస్తున్నారు.

**ప్రభుత్వ విద్యాసంస్థల్లో విస్తృత తనిఖీలు**

జగ్గంగూడ, శామీర్‌పేట, కీసర, ఉప్పల్, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో కలెక్టర్ తనఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా..? గదులు, బాత్‌రూమ్‌లు సరిగా ఉన్నాయా? లేవా అని తెలుసుకుని సమస్యలుంటే అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారు. మల్కాజిగిరి డిగ్రీ కళాశాలతో సహా పలు ఇంటర్ కళాశాలల్లో కలెక్టర్ పర్యటించి పలు పరిష్కారాలు చూపించారు. సొంత భవనాలు ఉన్న 400 అంగన్వాడీ కేంద్రాలకు పెయింట్స్ (రంగులు) బొమ్మల పెయింటింగ్స్ వేయించారు. కేంద్రాల ఆవరణలో కూరగాయలు, పూల మొక్కలు పెంచాలని ఆదేశాలిచ్చారు.

**అధికారుల అప్రమత్తం**

కలెక్టర్ ఆకస్మిక తనఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలతో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తమ శాఖ పరిధిలోని ఉద్యోగులు,సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచిస్తున్నారు. విధి నిర్వహణలో చురుకుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందుతున్న వాటన్నింటిని సక్రమంగా వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**అవినీతి ఉద్యోగుల్లో మొదలైన వణుకు..**

కలెక్టర్ మనుచౌదరి అవినీతి, అక్రమాలను సహించరనే సంకేతాలు అన్ని శాఖలకు తెలియడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిలో వణుకు మొదలయ్యింది. దీంతో పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు జరగకుండా సంబంధిత ఉద్యోగులు జాగ్రత్త పడుతున్నారు. అక్రమ భవనాలు, లేఅవుట్ల ఉంటే వారికి నోటీసులు ఇస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో జిల్లా అధికారులందరూ హాజరయ్యేలా చేపట్టిన చర్యలు విజయవంతం దిశగా కొనసాగుతున్నాయి. మహిళా గ్రూపుల పనితీరుతో సహా వ్యవసాయ, ఉద్యావన పంటల పరిస్థితి, పురపాలక సంఘాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, డంపింగ్ యార్డుల నిర్వహణపై ఆరా తీస్తుండటంతో కమిషనర్లు జాగ్రత్త పడుతున్నారు.

**ఫీవర్ సర్వే తీరుపై ఆగ్రహం**

సీజనల్ వ్యాధులను అరికట్టటానికి ఫీవర్ సర్వే నత్తనడకన సాగడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చొరవ తీసుకుని 40శాతం జరిగిన ఫీవర్ సర్వేలో వేగాన్ని పెంచారు. వ్యాధుల నివారణకు వైద్య శిబిరాల నిర్వహణ తదితర విషయాలతో సహా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులు దోపిడీ, నకిలీ డాక్టర్ల బెడదపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతో సహా ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీ అమలుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్లు (4), అసిస్టెంట్ ప్రొఫెసర్లు (7), ట్యూటర్లు (5), సీనియర్ రెసిడెంట్స్ (7) పోస్టులకు ఈ నెల 18న కుషాయిగూడలోని ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు, సువిధ ఆసుపత్రి పక్కన గల కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని అధికారులు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుకు రూ.వెయ్యి చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9849230566 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

**దుండిగల్:** ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సహకారంతో 12 మంది లబ్ధిదారులకు రూ.4.16 లక్షల విలువ గల చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బుచ్చి రెడ్డి, కొర్ర శంకర్ నాయక్, సాయి యాదవ్, సుధాకర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, పాల్వనూరి దర్శన్ రెడ్డి, ఆకుల బాబు, మల్లేష్, సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్:** సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## బఫర్‌జోన్‌లో నిర్మాణాలను కూల్చి వేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

**కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సర్వే నంబర్ 151, 179 ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మాజీ నాయకుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫాక్స్ సాగర్ చెరువు సమీపంలో ప్రస్తుతం భవన నిర్మాణం జరుగుతున్న భవనం 90 శాతం పూర్తిగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వస్తుందన్నారు. ఇరిగేషన్, మున్సిపల్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో అరుణ్ రావు, చందు, ఈశ్వర్ రెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి

**బాలానగర్:** ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొ. కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూలో జాతీయ హ్యాండ్లూమ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాదీ దుస్తులు ధరించడం ఒక ఆచారం మాత్రమే కాకుండా, అది మన దేశీయ చేనేత కార్మికుల జీవనోపాధిని ఆదుకోవడంలో మన పాత్రను సూచిస్తుందన్నారు. మనం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి శనివారాన్ని హ్యాండ్లూమ్ డేగా పాటిస్తూ ఖాదీ దుస్తులు ధరించాలని విశ్వవిద్యాలయం సిబ్బందికి సూచించారు.



లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మూర్ (యూఎస్‌ఏ)కి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న డాక్టర్ సత్యవోలు రాంబాబు
- నిజాంపేట్

# ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** సుపరిపాలన అందించే దిశగా కృషి చేస్తున్నామని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి బీరప్పనగర్ టెంపుల్ రోడ్డు, జగద్గిరినగర్ రోడ్డు నెం.1లలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ జగన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 12 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్‌ను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా బీరప్ప నగర్‌లోని పోచమ్మ ఆలయ పునర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్

**కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం**

సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో కీలకమన్నారు. ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్, నాయకులు బాలేష్, శ్రీను పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**చింతల్:** విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ బాలికల జూనియర్ కళాశాల చైర్మన్ శాంతికుమార్ యాదవ్ అన్నారు. గురువారం చింతల్‌లోని రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ గర్ల్స్ జూనియర్ కళాశాల ఫ్రెష్తోపియా ఫిస్టా 2025 ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యా వ్యవస్థలో ఎంతో పోటీ నెలకొందని, ఈ పోటీ ప్రపంచంలో ఆధునిక టెక్నాలజీ, మేధో సంపత్తిని ఉపయోగించి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ స్నేహలత, కళాశాల ప్రిన్సిపాల్ హేమలత రెడ్డి, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

# మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు



బీపీఎస్ ఒలంపియాడ్‌లో రాఖీ వేడుకల్లో చిన్నారులు



పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రాఖీ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా సభ్యులు

**కుత్బుల్లాపూర్:** బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రాఖీ వేడుకలు నిర్వహించారు. మహిళా మోర్చా సభ్యులు ఏసీపీ బాల గంగిరెడ్డి, సీఐ విజయవర్ధన్‌లతో పాటు సిబ్బందికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డితో పాటు సిబ్బందికి రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితా రావు, మాజీ కౌన్సిలర్ సరస్వతి, ప్రతినిధులు మాధురి, దుర్గ, భారతి, సరస్వతి, నవనీత, భారతి తదితరులు పాల్గొన్నారు.

**బీపీఎస్ ఒలంపియాడ్ స్కూల్‌లో..**

చింతల్, వేంకటేశ్వర్ నగర్‌లోని బీపీఎస్ ఒలంపియాడ్ స్కూల్‌లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సందడి చేశారు. రాఖీ పండుగ సోదరి – సోదరుల మధ్య బంధాన్ని, ప్రేమను, రక్షణను సూచిస్తుందని కోటిరెడ్డి పేర్కొన్నారు.

# మందకృష్ణ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ పథకం

**కుత్బుల్లాపూర్:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకంతో నిరుపేదలకు వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వాసుదేవరావు మాదిగ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో గురువారం రాసమల్ల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ సాధన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నపిల్లలకు ఉచితంగా ఆపరేషన్ చేయాలని మంద కృష్ణ మాదిగ పోరాటం చేశారన్నారు. దాని వల్లే నేడు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిలువేరు శ్రీనివాస్, బీసీ రజక సంఘం నాయకులు మురళి దోర్నాల, వెంకటేష్ పద్మశాలి, మహేష్, నర్సింగరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల నాయకులు

# సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

**కుత్బుల్లాపూర్:** అమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు అండగా ఉందామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం క్యూబాకు సంఘీభావంగా సీఐటీయు జీడిమెట్ల క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ మార్కెట్‌లో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాకు 90 మైళ్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపం క్యూబా కోటి 15 లక్షల జనాభాతో 1959లో సోషలిస్టు దేశంగా క్యూబాను ప్రకటించుకుందని, అనాటి నుండి 60 ఏళ్లుగా అమెరికా దాస్టికాన్ని ఎదిరించి నిలబడిందన్నారు. ఆంక్షలతో క్యూబా ప్రజల స్ఫూర్తిని దెబ్బతీయాలని అమెరికన్ పాలకులు ప్రయత్నం చేస్తున్నారని, వారికి సీఐటీయు ఆధ్వర్యంలో విరాళాలు అందిస్తున్నామన్నారు. ఈ నెల 2 నుంచి 10 వరకు కార్మిక వర్గం నుంచి క్యూబా సంఘీభావ నిధిని సమకూర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జీడిమెట్ల క్లస్టర్ అధ్యక్ష, కార్యదర్శులు పసుల అంజయ్య, రమేష్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, కృష్ణ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**దుండిగల్:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో జరగనున్న బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

## బీజేపీ బలోపేతానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**కుత్బుల్లాపూర్:** బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ అన్నారు. గురువారం దూలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం, అయ్యప్ప కాలనీల్లో చాయ్ పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు విగ్నేష్ హాజరు కాగా పలు అంశాలపై చర్చించారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అదే విధంగా బూత్ స్థాయిలో మహిళలు, యువతను పార్టీ పట్ల ఆకర్షితులయ్యేలా కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యకుడు అశోక్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, సీనియర్ నాయకులు నర్సింహ, సత్యనారాయణ, దుర్గా, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాకు ఫిర్యాదు చేసినందుకు దాడి

**జీడిమెట్ల:** ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై కొందరు అతని ఇంట్లోకి చొరబడి హత్య చేసేందుకు యత్నించారు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, బాధితుని వివరాల ప్రకారం.. చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్ 155లో 29 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. ఇట్టి స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నట్లు సదరు స్థలాన్ని కాపాడాలంటూ భగత్‌సింగ్‌నగర్ మాజీ అధ్యక్షుడు అల్లా బకాష్‌ ఈ నెల 4న హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం హైడ్రా అధికారులు భగత్‌సింగ్‌నగర్‌కు వచ్చి సదరు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. గురువారం మధ్యాహ్నం శ్రీనాథ్‌రావు అనే వ్యక్తి మరో 20 మందితో కలిసి అల్లా బకాష్ ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ అతనిపై దాడి చేయబోయారు. అడ్డుపడిన ఆయన భార్య షేకున్‌బీపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఆపేందుకు ప్రయత్నించిన లక్ష్మమ్మ, వెంకటసుబ్బమ్మలపై దాడి చేశారు. అనంతరం అక్కడ జరుగుతున్న సంఘటనను వీడియో తీస్తున్న మరో వ్యక్తి నుంచి సదరు వ్యక్తులు ఫోన్ లాక్కుని వీడియో డిలీట్ చేయించారని బాధితుడు అల్లా బకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు బదిలీ

**కుత్బుల్లాపూర్:** అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజును సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మల్టీజోన్–2 కు బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన వెంటనే సైబరాబాద్ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో సైబర్ క్రైమ్స్‌లో పనిచేస్తున్న శంకరయ్య అల్వాల్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.



# కుండపోత వర్షం



ప్రగతినగర్ రోడ్లపై వరద నీరు

**నిజాంపేట్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం ప్రజలకు గట్టి అవస్థలు తెచ్చిపెట్టింది. ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. కొన్ని చోట్ల మోకాళ్లలోతు వరకు వర్షపు నీరు నిలిచింది. ప్రధాన రహదారులపై నిలిచిన నీటితో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. నిజాంపేట్ – హైటెక్‌సిటీ మార్గం, ప్రగతినగర్ రోడ్, బాచుపల్లి మెయిన్‌రోడ్ వాహనదారులకు పరీక్షగా మారాయి. వర్షపు నీరు రోడ్లపై పారక, డ్రైనేజీ సిస్టమ్ పూర్తిగా ఫెయిల్ కావడంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి ఉండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

ప్రతి సమావేశంలో సమస్యలపై చర్చించామంటూ ప్రకటనలు చేస్తూ వచ్చారు. కానీ నిజాంపేట్‌లో వర్షం పడితే జనం బహిరంగ నాళాల్లోనే నడవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. నిత్యం శుభ్రపరుస్తున్నామని చెప్పిన డ్రైనేజీ లైన్లు నీటితో నిండి మూసుకుపోయాయి. ప్రతి వానకు ఇలా జరగడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్ పలు వాగ్దానాలు చేస్తూ వస్తోంది. కానీ వర్షం పడితేనే వాస్తవ పరిస్థితి బయటపడుతోంది అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంట్లోకి వచ్చిన వరదనీరు

ట్రాఫిక్ జాంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనదారులు



ఆదిత్య గార్డెన్‌లో నీటిలో చిక్కుకున్న కారు



సాయినగర్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు